సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 29 । మే । 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 470 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



'అనంత' క్రీడా మకుటం

అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియం ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. రంజీ మ్యాచ్‌లకు వేదికగా నిలిచి ఖ్యాతి పొందింది. 8లో

గరిష్టం/కనిష్టం
37.3°/23.5°

జిల్లావ్యాప్తంగా మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆదాయంలో అగ్రగామిగా నిలుద్దాం



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: ప్రజా రవాణాశాఖలోని ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేసి ఆదాయం పెంపులో రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా నిలుపుదామని జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పుట్టపర్తిలోని తన కార్యాలయంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ పర్సన్లు, అకౌంట్ సూపర్ వైజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అరుణాచలానికి అధికంగా ప్రత్యేక బస్సులు నడిపి ఆదాయం పెంచిన హిందూపురం డిపో మేనేజర్ నరేంద్రరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ హంపన్న, గ్యారేజ్ ఇంజినీర్ రామ్ నిషాంత్‌కు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి డిపో నుంచి ఆదాయం పెంపునకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. పనితీరు బాగా లేని సర్వీసులు రీషెడ్యూల్ చేయాలన్నారు. కేఎంపీఎల్ పెంచడంతో పాటు వేగం తగ్గించి ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు.

నారాయణ పాఠశాల సీజ్



నారాయణ పాఠశాలను సీజ్ చేస్తున్న డీఈఓ మీనాక్షి

కదిరి అర్బన్: స్థానిక నారాయణ పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో అడ్మిషన్లు, స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని కలెక్టర్‌కు పలు విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈఓలు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డిలను వెంటబెట్టుకుని మీనాక్షి మంగళవారం ఆ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఫిర్యాదులోని అంశాలు వాస్తవమని నిర్ధారణ కావడంతో పాఠశాలకు తాళం వేసి సీజ్ చేశారు.

బడిబస్సుకు పరీక్ష

విద్యార్థులను పాఠశాలలకు, కళాశాలలకు తీసుకువెళ్లే బస్సులకు రవాణా శాఖ పరీక్ష పెడుతోంది. పాస్ అయితేనే అనుమతులు ఇస్తోంది. కాలం చెల్లిన బస్సులను నిర్మొహమాటంగా సీజ్ చేస్తోంది. ప్రమాణాలు పాటించకపోయినా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తోంది. ఈ నెల 15వ తేదీతో ఎఫ్‌సీ పూర్తి కావడంతో రెన్యూవల్స్ కోసం బస్సులు హిందూపురం ఆర్టీఏ కార్యాలయం ఎదుట క్యూ కట్టాయి.

- బస్సు సామర్థ్య పరీక్షలు చేపట్టిన రవాణా శాఖ
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం క్యూ కడుతున్న వాహనాలు
- 'ఈ–ప్రగతి' పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్రత్యేక స్లాట్‌లు
- అన్నీ సవ్యంగా ఉంటేనే అనుమతులు
- జిల్లాలోని 362 బడి బస్సుల్లో 102 బస్సుల ఎఫ్‌సీ పూర్తి





ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం హిందూపురం ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో నిలిపిన బస్సులు (ఇన్‌సెట్‌లో) బస్సు నడుపుతూ కండీషన్ చెక్ చేస్తున్న అధికారి

హిందూపురం అర్బన్ : పాఠశాలలు, కళాశాలలు 15 రోజుల్లో పునఃప్రారంభం కానున్నాయి. పట్టణం, పల్లె తేడా లేకుండా ఇప్పుడు ప్రయివేట్ విద్యా సంస్థలన్నీ విద్యార్థులను తరలించేందుకు బస్సులను ఏర్పాటు చేశాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఫీజు వసూలు చేస్తున్నాయి. ఈ బస్సులు విద్యార్థులను ఇళ్ల నుంచి భద్రంగా తీసుకెళ్లి అంతే జాగ్రత్తగా ఇంటికి చేర్చాలి. ఇందుకోసం ప్రతి బస్సును పూర్తి కండీషన్‌లో ఉంచాలి. ఏ మాత్రం తేడా వచ్చినా జరిగే నష్టం ఎవరూ ఊహించలేం. కొన్ని యాజమాన్యాలు బస్సులకు రంగులు వేసి రోడ్డెక్కిస్తున్నాయి. కనీస ప్రమాణాలూ పాటించడం లేదు. అందుకే ఏటా బడులు పునఃప్రారంభంలోనే మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బస్సు కండీషన్ స్వయంగా తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) జారీ చేస్తారు. ఏ చిన్న లోపం ఉన్నా.. వెనక్కు పంపుతారు. గత ఏడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుండటంతో రెన్యూవల్ కోసం బడిబస్సులు ఆర్టీఏ కార్యాలయం వద్ద క్యూ కడుతున్నాయి.

ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్

జిల్లాలో 362 విద్యా సంస్థలు పిల్లల రవాణా కోసం బస్సులు నడుపుతున్నాయి. ఆయా విద్యాసంస్థల బస్సుల సామర్థ్య పరీక్షలు చేపట్టడానికి హిందూపురంలోని రవాణా కార్యాలయం సిద్ధమైంది. బస్సుల కండీషన్...భద్రతా ప్రమాణాలు ఎలా ఉండాలన్న దానిపై ఇప్పటికే ఆయా విద్యాసంస్థలకు రవాణా శాఖ అధికారులు మార్గదర్శకాలు ఇచ్చారు. నిబంధనల మేరకు బడిబస్సు సిద్ధంగా ఉంటే ఫిట్‌నెస్ పరీక్ష కోసం ముందుగా విద్యాసంస్థల యాజమాన్యాలు ఈ–ప్రగతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం రవాణాశాఖ అధికారులు ఎఫ్‌సీ కోసం ఓ తేదీని కేటాయిస్తారు. ఆ తేదీన బస్సు తీసుకు వస్తే అందరి సమక్షంలో వాహన ఫిట్‌నెస్ తనిఖీ చేస్తారు.

ఇప్పటివరకూ 102 బస్సుల ఎఫ్‌సీ పూర్తి

ఆర్‌టీఏ అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 362లకుపైగా విద్యాసంస్థల బస్సులున్నాయి. ఇందులో మంగళవారం నాటికి 102 బస్సుల ఎఫ్‌సీ పూర్తి చేసుకున్నట్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) జయశ్రీ తెలిపారు. రూల్ నంబర్185(ఎఫ్) ప్రకారం ప్రతి స్కూల్, కళాశాల యాజమాన్యం బస్సులు నడపాల్సి ఉంటుంది. ఇందులో ముఖ్యమైనది వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్. నిబంధనలు అన్నీ కరెక్ట్‌గా ఉంటే తనిఖీలు నిర్వహించి బస్సు రోడ్డెక్కేందుకు అనుమతి ఇస్తున్నారు.

అన్నీ సవ్యంగా ఉంటేనే అనుమతులు

హిందూపురంలోని ఓ ప్రముఖ పాఠశాలకు చెందిన బస్సులను ఎఫ్‌సీ కోసం రెండు రోజుల క్రితం ఆర్టీఏ కార్యాలయానికి తీసుకువచ్చారు. బస్సు కండీషన్ పరిశీలించిన ఎంవీఐ వేగాన్ని నియంత్రించే స్పీడ్ గవర్నర్లు సరిగా లేనందున రెండు బస్సులకు అనుమతులు ఇవ్వలేదు. అలాగే విద్యార్థులు బస్సు ఎక్కేందుకు స్టెప్స్ సరిగా లేని కారణంగా మరో రెండు బస్సులను వెనక్కు పంపారు. ఇక చిన్నారులు కిటికీల గుండా తలలు బయటపెట్టకుండా ఏర్పాటు చేసే పైపులు లేవని మరో బస్సుకు అనుమతులు నిరాకరించారు. టైర్ కండీషన్ సరిగా లేకపోవడం.. అత్యవసర ద్వారాలు లేని వాటికీ ఎఫ్‌సీ నిరాకరించారు. ఇలా ఇప్పటి వరకూ రవాణా శాఖ అధికారులు మొత్తం 13 బస్సులకు అనుమతులు ఇవ్వలేదు.

ఫిట్‌నెస్ లేకపోతే సీజ్ చేస్తాం



విద్యా సంస్థల బస్సుల సామర్థ్యం బాగుంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) జారీ చేస్తాం. జూన్ 15వ తేదీలోపు నిబంధనల ప్రకారం బస్సు సిద్ధం చేసుకుని తీసుకువస్తే తనిఖీలు చేసి రోడ్డుపై తిరిగేందుకు అనుమతిస్తాం. పాత బస్సులు.. కండీషన్‌లో లేని వాటికి అనుమతులు ఇవ్వం. గడచిన వారం రోజుల్లో 102 బస్సులకు అనుమతులు ఇచ్చాం. మిగిలిన వారు త్వరిత గతిన ఎఫ్‌సీ చేయించుకోవాలి. ఎఫ్‌సీ లేకుండా బస్సులు నడిపితే సీజ్ చేయడమే కాకుండా సదరు విద్యాసంస్థలకు జరిమానా విధిస్తాం.

– కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, హిందూపురం

నిబంధనలు ఇలా...

- 60 ఏళ్లు దాటిన వ్యక్తి పాఠశాల, కళాశాల బస్సు నడిపేందుకు అనర్హుడు.
- ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు చేయించి ఆ రికార్డులు భద్రపరచాలి.
- డ్రైవర్ల నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు తెలియజేయాలి. డ్రైవర్‌కు కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి.
- ప్రతి కళాశాల/ స్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేయాలి. ప్రతి నెల వాహనానికి సంబంధించి స్థితిగతులను రిజిస్టర్ చేయాలి. బస్సులో ఫిర్యాదు పుస్తకం అందుబాటులో ఉంచాలి. అలాగే ప్రథమ చికిత్స కిట్ బస్సులో ఉంచాలి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు అవసరమైన సామగ్రి ఉండాలి.
- ప్రతి బస్‌కు డ్రైవర్‌తో పాటు అటెండర్ ఉండాలి. వాహనం ప్రయాణించే రూట్, విద్యార్థుల వివరాలను ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు నోట్ చేసుకోవాలి. తల్లిదండ్రులకు డ్రైవర్ వివరాలను తెలియజేయడమే కాకుండా విద్యార్థుల వివరాలు డ్రైవర్ వద్ద అందుబాటులో ఉంచుకోవాలి.
- సీటింగ్ కెపాసిటీ మించి విద్యార్థులను ఎక్కించరాదు.
- బస్సు వేగాన్ని నియంత్రించే స్పీడ్ గవర్నర్లు ప్రతి బస్సుకూ ఏర్పాటు చేసుకోవాలి. అలాగే చిన్నారులు కిటికీల నుంచి తల, చేతులు బయట పెట్టకుండా ఏర్పాటు చేయాలి. అత్యవసర ద్వారాలు తప్పనిసరి.
- బస్సు బ్రేకు వేసినప్పుడు నాలుగు వైపులా పార్కింగ్ లైట్లు వెలగాలి.
- బస్సులోని లైట్లన్నీ పనిచేయాలి. వాహనం నలువైపులా రిఫ్లెక్టింగ్ టేపులు ఉండాలి.
- బస్సు ఫుట్ బోర్డు పిల్లలు ఎక్కేందుకు వీలుగా ఉండాలి.

82 మార్కులు సాధిస్తే 18 వేశారు!

- పదో తరగతి మూల్యాంకనంలో ఇన్విజిలేటర్ తప్పిదం
- రీ వెరిఫికేషన్‌లో బయటపడిన వైనం



అధికారులు పంపిన రీవెరిఫికేషన్ పత్రం



ఉత్తీర్ణత సాధించిన గోగుల అంజి

బత్తలపల్లి: పదో తరగతిలో ఫెయిల్‌గా చూపిన ఓ విద్యార్థి.. జవాబు పత్రం రీ వెరిఫికేషన్‌లో ఏకంగా 82 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. వివరాలు... బత్తలపల్లి మండలం రాఘవంపల్లికి చెందిన గోగుల సూర్య నారాయణ కుమారుడు అంజి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదివాడు. ఈ ఏడాది మార్చిలో 2426125124 రోల్ నంబర్ కింద బత్తలపల్లిలోని జెడ్పీ హెచ్‌ఎస్ కేంద్రంగా పబ్లిక్ పరీక్షలు రాశాడు. తెలుగులో 98, హిందీ 89, గణితం 92, భౌతిక శాస్త్రం 87, సాంఘిక శాస్త్రంలో 86 మార్కులు సాధించాడు. అయితే ఇంగ్లిష్‌లో కేవలం 18 మార్కులు వేయడంతో ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. మెరిట్ విద్యార్థిగా మన్ననలు పొందిన అంజి ఫెయిల్ అయ్యాడనగానే ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. మానసికంగా కుదేలైన బాధిత విద్యార్థికి సదరు ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ధైర్యం చెప్పి వెంటనే రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేయించారు. ఈ ఫలితాలు సోమవారం అందాయి. 100కు 82 మార్కులు వచ్చాయి. ఇన్విజిలేటర్ తప్పిదం కారణంగా తమ కుమారుడు ఇన్ని రోజులు మానసిక వేదన అనుభవించాడని తల్లిదండ్రులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను కోరారు.

జంతు సంరక్షణ చట్టం జిల్లా నోడల్ అధికారిగా విష్ణు

పుట్టపర్తి టౌన్: జంతు సంరక్షణ చట్టం జిల్లా నోడల్ అధికారిగా అడిషనల్ ఎస్పీ ఎస్.విష్ణు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విష్ణు మాట్లాడుతూ, జంతు సంరక్షణ చట్టాలు పక్కాగా అమలు చేస్తామని తెలిపారు. జంతువుల అక్రమ రవాణా చేసినా, వధించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే తనకు సమాచారం ఇవ్వాలన్నారు.

విత్తన పంపిణీకి వేళాయె

మరో 5 రోజుల్లో నైరుతి పలకరించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. తొలకరి వర్షాలతో రైతులు ఇప్పటికే పొలాలు సిద్ధం చేసుకుని సాగుకు సన్నద్ధమయ్యారు. దీంతో బుధవారం నుంచి రాయితీ విత్తన పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. లక్ష క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు.

- నేడు పుట్టపర్తిలో విత్తన పంపిణీ ప్రారంభించనున్న కలెక్టర్ అరుణ్‌బాబు
- ఇప్పటికే ఆర్బీకేలకు చేరిన విత్తనం
- 51 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్లు
- అందరికీ విత్తనం అందేలా వ్యవసాయ శాఖ ఏర్పాట్లు



ఎనుములపల్లిలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన విత్తన వేరుశనగ బస్తాలు

జిల్లాలో రైతు భరోసా కేంద్రాలు: **416**

విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల సంఖ్య : **60,176**

విత్తన రాయితీ: **40 శాతం**

అందజేసే రకాలు : **కే-6, టీసీజీఎస్-1694, కదిరి-లేపాక్షి-1812**

నిల్వ చేసిన విత్తన కాయలు: **51,179 క్వింటాళ్లు**

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ రాయితీ విత్తన పంపిణీ జిల్లాలో బుధవారం ప్రారంభం కానుంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు సంబంధం లేకుండా ప్రభుత్వ అధికారులు, విత్తన కాయలను పంపిణీ చేయనున్నారు. విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ అరుణ్‌బాబు పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయం వద్ద ప్రారంభించనున్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు కూపన్లను చూపించి విత్తన కాయలను తీసుకెళ్లవచ్చు. విత్తనకాయలు సరిగా లేకపోతే మార్చి ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో సుమారు లక్ష క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేసేలా వ్యవసాయ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇప్పటికే జిల్లాలోని 416 రైతు భరోసా కేంద్రాలకు విత్తన కాయలను సరఫరా చేశారు.

వేరుశనగతో పాటు ఇతర విత్తనాల పంపిణీ

జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 2,44,763 హెక్టార్లు కాగా, ఎక్కువగా వేరుశనగ సాగు కానుంది. ఇప్పటి వరకూ 60,176 మంది రైతులు 51 వేల క్వింటాళ్ల వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈనేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు 1,00,443 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో కే–6 రకంతో పాటు కదిరి–లేపాక్షి 1812 రకం కాయలు సిద్ధంగా ఉంచారు. వేరుశనగతో పాటు 1,500 క్వింటాళ్ల కందులు, 300 క్వింటాళ్ల రాగులు, 200 క్వింటాళ్ల పెసలు, 300 క్వింటాళ్ల ఉలవలు, 100 క్వింటాళ్ల అలసంద, 20 క్వింటాళ్ల కొర్ర, 138 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు సరఫరా చేయడానికి అనుమతులు వచ్చాయి. ఇవన్నీ 40 శాతం సబ్సిడీతో రైతులకు అందజేయనున్నారు.

40 శాతం సబ్సిడీ

విత్తన వేరుశనగలో కే–6 రకం క్వింటా పూర్తి ధర రూ.9,500 కాగా, 40 శాతం సబ్సిడీ పోను రైతులు తమ వాటాగా రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది. ఇక కదిరి–లేపాక్షి రకం క్వింటా పూర్తి ధర రూ.8,700 కాగా, 40 శాతం సబ్సిడీ పోను రైతు వాటాగా రూ.5,220 చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్టంగా 90 కిలోలు (30 కిలోల 3 బస్తాలు) పంపిణీ చేయనున్నారు.

ఆర్బీకేలకు చేరిన విత్తన కాయలు

రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు బుధవారం నుంచి పంపిణీ చేయడానికి ఇప్పటికే జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు విత్తన కాయలు చేరాయి. అలాగే రైతులకు అవసరమయ్యే ఎరువులు సైతం అధికారులు ఆర్బీకేల్లో సిద్ధంగా ఉంచారు. జిల్లాకు 39,378 టన్నులు అవసరం కాగా, అందులో యూరియా 14,875 టన్నులు, డీఏపీ 5,969 టన్నులు, ఎంఓపీ 1,151 టన్నులు, కాంప్లెక్స్ 2,821 టన్నులు సరఫరా చేయడానికి అనుమతి వచ్చింది. ఇప్పటికే 1,800 టన్నుల వివిధ రకాల ఎరువులను ఆర్‌బీకేల్లో సిద్ధంగా ఉంచారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



బిట్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

- అభ్యర్థులు, ఏజెంట్లకు ప్రత్యేక ఏర్పాట్లు
- స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం/లేపాక్షి : ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. స్ట్రాంగ్ రూంలలో ఉన్న ఈవీఎంలను కౌంటింగ్ హాలులోకి తీసుకెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం ఆయన హిందూపురంలోని 'బిట్' ఇంజినీరింగ్ కళాశాల, లేపాక్షి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. భద్రతాపరమైన అంశాలకు సంబంధించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లోని అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ హాలులోకి వెళ్లేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 6 అసెంబ్లీ, హిందూపురం పార్లమెంటు నియోజవర్గాలకు సంబంధించి పోలింగ్ బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు అత్యంత జాగ్రత్తగా భద్రపరిచామన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం విడివిడిగా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓట్లు లెక్కింపు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, కంట్రోల్‌రూం నుంచి పర్యవేక్షణ ఉంటుందన్నారు. స్ట్రాంగ్ రూమ్ చుట్టు పక్కల 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు, ఇతరులు ఎవరూ కౌంటింగ్ కేంద్రాల చుట్టుపక్కల సంచరించరాదని హెచ్చరించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్‌ఓ కొండయ్య, రిటర్నింగ్ ఆఫీసర్లు భాగ్యరేఖ, వెంకట శివసాయిరెడ్డి, వంశీకృష్ణ, గౌరీ శంకర్, ఆయా నియోజకవర్గాల ఎన్నికల సహాయ అధికారులు, డీఎస్పీలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బ్లాక్‌ల వారీగా కౌంటింగ్ కేంద్రాలు ఇలా...

బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో

- మొదటి అంతస్తులోని సివిల్ ఇంజినీర్ బ్లాక్‌లో మడకశిర అసెంబ్లీ, 'పురం' పార్లమెంట్ స్థానం కౌంటింగ్ జరుగుతుంది.
- మొదటి అంతస్తులోని ల్యాబ్ బ్లాక్‌లో కదిరి అసెంబ్లీ, 'పురం' పార్లమెంట్ స్థానాల ఓట్ల లెక్కింపు ఉంటుంది.
- రెండో అంతస్తులోని ఈఈఈ బ్లాక్‌లో పెనుగొండ అసెంబ్లీ, పురం పార్లమెంట్ స్థానాల కౌంటింగ్ ప్రక్రియ ఉంటుంది.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో హిందూపురం అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ స్థానానికి సంబంధించిన కౌంటింగ్ జరుగుతుంది.

లేపాక్షి సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో...

- మొదటి అంతస్తులో పుట్టపర్తి అసెంబ్లీ, 'పురం' పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఉంటుంది.
- రెండో అంతస్తులో ధర్మవరం అసెంబ్లీ, 'పురం' పార్లమెంట్ స్థానాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుంది.
- గ్రౌండ్ ఫ్లోర్‌లోని 3వ నంబర్ గదిలో హిందూపురం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ఉంటుంది.

పోలీసుల తనిఖీలు ముమ్మరం

పుట్టపర్తి టౌన్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్‌డివిజన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాల కేసుల్లో పట్టుబడిన నేరస్తుల ఇళ్లను తనిఖీలు చేశారు. గొడవల జోలికి వెళ్లకూడదని సూచించారు. సమస్యలు సృష్టించినా, గొడవలకు ఇతరులను ప్రేరేపించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. రాజకీయ వివాదాలకు అందరూ దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కౌంటింగ్ సమయంలోనూ, ఫలితాల తర్వాత గ్రామాల్లో ఎలాంటి సంబరాలు, ఊరేగింపులు చేసుకోవద్దన్నారు.

క్లుప్తంగా

పాము కాటుతో చిన్నారి మృతి


ఖుషి (ఫైల్)

అగళి: పాము కాటుతో ఓ చిన్నారి మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... అగళి మండలం నందరాజనపల్లికి చెందిన రంగనాథ్, పద్మ దంపతులకు తొమ్మిదేళ్ల వయసున్న కుమార్తె ఖుషి ఉంది. సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న ఖుషిని అర్ధరాత్రి దాటిన తర్వాత కట్లపాము కాటు వేసింది. ఆ సమయంలో మేల్కొని పామును గమనించిన చిన్నారి కేకలు వేయడంతో తల్లి దండ్రులూ మేల్కొన్నారు. వెంటనే పామును హతమార్చి బాలికను కర్ణాటకలోని శిరలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందింది. కాగా, ఖుషి నందరాజపల్లికి సరిహద్దున ఉన్న కర్ణాటకలోని కార్వేహల్లి ప్రభుత్వ పాఠశాలలో నాల్గో తరగతి చదువుతోంది. పాము కాటుతో చిన్నారి మృతి తెలిసిన వెంటనే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గణితం పరీక్షకు 1,767 మంది గైర్హాజరు

పుట్టపర్తి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో సజావుగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన గణితం పరీక్షకు 3,591 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1,824 మంది మాత్రమే హాజరయ్యారు. 1,767 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. విద్యాశాఖ అధికారులు వివిధ పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.

నెమలి అప్పగింత


నెమలిని ఫారెస్ట్ వాచర్ ఆంజనేయులుకు అప్పగిస్తున్న స్థానికులు

హిందూపురం: హిందూపురంలోని నానెప్పనగర్‌లో ఉన్న గాయత్రిదేవి ఆలయం వద్ద మంగళవారం రాత్రి స్థానికులు నెమలిని గుర్తించారు. విషయాన్ని వారు లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్‌కు తెలియజేయగా ఆయన వెంటనే ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అక్బర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు రేంజ్ ఫారెస్ట్ వాచర్ ఆంజనేయులుకు స్థానికులు నెమలిని అప్పగించారు.

'అనంత' క్రీడా మకుటం

- దేశవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చిన నీలం సంజీవరెడ్డి స్టేడియం
- సల్దానా విగ్రహం ఏర్పాటు చేయాలని నాటి క్రికెటర్ల విజ్ఞప్తి


అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియం

అనంతపురం/కల్చరల్: అనంతపురం పేరు వినగానే ఎవరికైనా పోరాటాలు, రికార్డులకు కేంద్రబిందువైన ప్రాంతంగా గుర్తుకు వస్తుంది. అలాంటి అనంతపురానికి క్రీడల్లో దేశవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చింది నీలం సంజీవరెడ్డి స్టేడియం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే హైదరాబాద్ తర్వాత నిర్మితమైన స్టేడియంగా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. బెంగళూరులో కూడా స్టేడియం లేని ఆ రోజుల్లో అనంతపురం కేంద్రంగా క్రీడామైదానం నిర్మాణం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. అనంతరం అనతి కాలంలోనే ఎంతో మంది క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేసింది. మరెన్నో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలకు వేదికగా మారింది. అనంత క్రీడా మకుటంలో కలికితురాయిగా నిలిచిన నీలం సంజీవరెడ్డి స్టేడియంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నిర్మాణంలో సింహభాగం ప్రైవేట్ వ్యక్తులే

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన క్రీడా మైదానాల్లో ఒకటిగా నిలిచిన నీలం సంజీవరెడ్డి స్టేడియాన్ని ప్రభుత్వం కాకుండా ప్రైవేట్ వ్యక్తులే నిర్మించారంటే ఆశ్చర్యం కలుగకమానదు. వివిధ రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికగా నిలిచిన ఈ స్టేడియం ప్రస్తుతం వాకర్స్‌కు ప్రధాన కేంద్రంగా మారింది. ఉదయం 5 గంటలైతే చాలు మెరుగైన ఆరోగ్యం కోసం పరుగులు పెట్టే నగరవాసుల్లో అత్యధికులు ఈ స్టేడియంలోనే ఉంటారు. స్వాతంత్య్రం వచ్చిన తొలి రోజుల్లో క్రికెట్ క్రీడ అంటే కేవలం మెట్రో నగరాలకే పరిమితమై ఉండేది. 1950 తర్వాత దేశమంతటా మోజు పెరిగినా... ఆ రోజుల్లో క్రికెట్ ఆడేందుకు అనువైన మైదానాలు లేక చాలా మంది నిరుత్సాహ పడేవారు. ఎక్కడైనా క్రికెట్ మ్యాచ్ జరుగుతోందంటే చాలు రేడియోల ఎదుట తిష్ట వేసి కామెంటరీ వినేవారు. ట్రాన్సిస్టర్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత చెవులకు ఆనించుకుని రోడ్లపై తిరుగుతూ కామెంటరీ వినేవారు.

జిల్లాలో క్రికెట్‌కు పునాది వేసిన ఉత్తర్‌కర్

జిల్లాలో 1950 తర్వాత క్రికెట్‌కు పునాదులు పడ్డాయి. ఆ రోజుల్లో అనంతపురానికి చెందిన క్రీడాభిమాని ఉత్తర్‌కర్ జ్ఞానేశ్వరరావు జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి, క్రీడాభివృద్ధికి బాటలు వేశారు. అదే సమయంలో జిల్లా కేంద్రంలో క్రికెట్ ఆడేందుకు అనువైన స్థలం కోసం అన్వేషణ కూడా మొదలైంది. ఈ క్రమంలోనే ఊహించని విధంగా క్రీడలన్నా.. క్రీడాకారులన్నా అభిమానం చూపించే ఐపీఎస్ అధికారి జేఎస్ సల్దానా జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం ఆయన అన్వేషణకు కలిసి వచ్చింది. ఎస్పీని కలిసి పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ)కు చెందిన మైదానం నుంచి కొంత స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరఫున జ్ఞానేశ్వరరావు, తదితరులు విన్నవించారు. దీనిపై ఎస్పీ సల్దానా సైతం సానుకూలంగా స్పందించారు.

అనంతకు వచ్చిన దిగ్గజాలు

జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణమైన సమయానికి ఒక్క హైదరాబాద్ మినహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలు, కర్ణాటక రాజధాని బెంగళూరుతో సహా మరెక్కడా క్రికెట్ మైదానం ఉండేది కాదు. టర్ఫ్ వికెట్ కావడంతో జాతీయ స్థాయి ఆటలకు వేదికగా మారింది. దీంతో 1962, 1964, 1971 వరకు ఈ స్టేడియం పలు రంజీ మ్యాచ్‌లకు వేదికగా మారింది. అప్పటి క్రికెట్ భారత జట్టు కెప్టెన్ అజిత్ వాడేకర్, పాలిఉమ్రీగర్, రమాకాంత్ దేశాయ్, చందూ బోర్డే, సర్దేశాయి దిలీప్ తదితరులు ఈ మైదానంలో తమ ఆట తీరుతో అనంత వాసులను ఉర్రూతలూగించారు. ప్రధానంగా చైనా యుద్ధ సమయంలో స్టార్ క్రికెటర్లను ఈ మైదానానికి రప్పించి బెనిఫిట్ మ్యాచ్ ఆడించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఎన్‌డీఎఫ్ (నేషనల్ డిఫెన్స్ ఫండ్)కు విరాళంగా అందజేశారు. జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి ఎదిగేలా చేసిన ఈ క్రీడా మైదానంలో వెల్కమ్ ఆర్చ్‌తో పాటు సల్దానా విగ్రహం ఏర్పాటు చేయాలని నాటి క్రికెటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేవలం ఆరు నెలల్లో పూర్తి

పీటీసీకి చెందిన స్థలం నుంచి కొంత స్టేడియం నిర్మాణానికి కేటాయించగానే 1961లో పనులు మొదలు పెట్టారు. ఆ రోజుల్లో చెన్నైకు చెందిన చిదంబరం (కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరానికి ఈయన తాత) సాయంతో స్టేడియం నిర్మాణానికి పునాదులు పడ్డాయి. రిజర్వ్ పోలీసుల శ్రమదానంతో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే క్రీడా మైదానం రూపుదిద్దుకుంది. హిందూపురానికి చెందిన బస్సు ఓనర్ శ్రీకంఠయ్య, ఆర్‌పీజీటీ బస్సు యజమాని బాలకృష్ణన్, ఉరవకొండ బస్సు ఓనరు దండా వెంకయ్య తదితరులు తమ వంతు ఆర్థిక సాయం అందజేయడంతో పాటు రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలకు పైగా విరాళాలు సేకరించి స్టేడియంకు తుదిమెరుగులు దిద్దారు. ఎస్పీ సల్దానా, జ్ఞానేశ్వరరావును కార్యవర్గ సభ్యులుగా ప్రకటిస్తూ వారికి స్టేడియం నిర్వహణ బాధ్యతను అప్పటి పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందరామ్ అప్పగించారు. దీంతో స్టేడియంకు పేరు పెట్టాలని భావించి అందరూ సమావేశమై చర్చించారు. జిల్లా ప్రజల కల సాకారం చేసిన సల్దానా పేరు పెట్టాలని ప్రతిపాదిస్తే అందుకు ఆయన సమ్మతించలేదు. పేరు కోసం తానెన్నడూ పనిచేయలేదని, దీంతో జిల్లా కీర్తిప్రతిష్టలను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన నీలం సంజీవరెడ్డి పేరును ఏకగ్రీవంగా ఆమోదించి ఆ పేరుతోనే మైదానాన్ని ఆవిష్కరించారు.

సల్దానా కృషి మరువలేనిది



నీలం సంజీవరెడ్డి స్టేడియం నిర్మాణంలో ఐపీఎస్ ఆఫీసర్ సల్దానా కృషి మాటల్లో వర్ణించడం చాలా కష్టం. ఆ రోజుల్లో ఆయన వెంట ఉన్నవారిలో ఇప్పుడు దాదాపు ఎవరూ లేరు. ఊరూరా తిరిగి క్రికెట్ క్లబ్‌లు ఏర్పాటు చేసి పోటీలను నిర్వహించడమే కాకుండా తానే స్వయంగా పోటీల్లో పాల్గొని యువతను ఉత్సాహపరిచేవారు. ఈ క్రమంలోనే తానే స్వయంగా మూడు రాష్ట్రాల్లో తిరిగి నిధులు సమకూర్చారు. అర్ధరాత్రి తన వాహనంలో శింగనమలకు వెళ్లి చీకట్లోనే పొలాల బయలు ప్రదేశంలో పడిన గడ్డి సేకరించుకుని వచ్చి స్టేడియంలో టర్ఫ్ వేశారు. ఆయనతో కలిసి రంజీ మ్యాచ్ ఆడే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. సల్దానా విగ్రహంతో పాటు వెల్కమ్ ఆర్చ్ ఏర్పాటు చేస్తే ఆయన రుణం తీర్చుకున్నట్లవుతుందని భావిస్తున్నా.

– జ్ఞానేశ్వరరావు ఉత్తర్‌కర్, మాజీ క్రికెటర్, అనంతపురం


1964 మార్చిలో అనంతపురంలో జరిగిన ఇరానీ ట్రోఫీ మ్యాచ్‌లో పాల్గొన్న బొంబాయి, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్ల క్రీడాకారులు (ఫైల్)


1962లో జరిగిన రంజీ మ్యాచ్‌లో పాల్గొన్న అప్పటి ఎస్పీ సల్దానా, మూర్తి, జ్ఞానేశ్వరరావు (ఫైల్)

మళ్లీ సీఎం వైఎస్ జగనే...

- ఎంపీ గోరంట్ల మాధవ్


తిరుమల ఆలయ ప్రాంగణంలో సతీమణితో ఎంపీ గోరంట్ల మాధవ్

తిరుమల: రాష్ట్రానికి మళ్లీ సీఎం వైఎస్ జగనే అవుతారని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. తిరుమలకు వచ్చిన ఆయన మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయంటేం మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రావడం ఖాయమన్నారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. 2019లో వచ్చిన ఫలితాలే మళ్లీ పునరావృతం కానున్నాయన్నారు. టీడీపీ నేతలు దొంగ ఓట్లు వేస్తున్నారనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ అడ్డుకునే ప్రయత్నం చేసిందే తప్ప శాంతి భద్రతలకు విఘాతం కలిగించలేదని స్పష్టం చేశారు. అసెంబ్లీలో 151కి పైగా.. పార్లమెంట్ స్థానాలకు 22కు పైగా సీట్లు తమ పార్టీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. నిర్దేశించుకున్న ముహూర్తంలోనే సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.

రేపు 'హలో అనంత రైతన్న' కార్యక్రమం

గుత్తి రూరల్: ఉద్యాన పంటల సాగులో సందేహాల నివృత్తి కోసం ఈ నెల 30న హలో అనంత రైతన్న ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గుత్తి ఉద్యాన శాఖ అధికారి మిత్రవింద మాధవి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటలు, కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తున్న రైతులు గురువారం రాత్రి 7.15 గంటలకు 08554–225533 నంబర్‌కు ఫోన్ చేసి పంటల సాగులో తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం తెలుసుకోవచ్చు. రైతుల సందేహాలను రాప్తాడు ఉద్యాన అధికారి రత్నకుమార్ నివృత్తి చేయనున్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం: రోడ్డు ప్రమాదం, అనారోగ్య కారణాలతో వేర్వేరుగా మృతి చెందిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ గౌతమి శాలి ఆర్థిక చేయూతనందించారు. రూ.8,77,200 విలువ చేసే రెండు చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. అనంతపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న హోంగార్డు నిజాముద్దీన్ రెండున్నరేళ్ల క్రితం మృతి చెందారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డు నాగప్ప ఈ ఏడాది ఫిబ్రవరి 6న రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ క్రమంలో నిజాముద్దీన్ తండ్రి రుక్మానుద్దీన్‌కు రూ.4,38,600, నాగప్ప భార్య ఉదయకు రూ.4,48,600 విలువ చేసే చెక్కులను ఎస్పీ అందజేశారు. జిల్లా హోంగార్డులు తమ గౌరవ వేతనంలో ఒక రోజు వేతనాన్ని సహచర కుటుంబాలకు అందజేయడాన్ని ఈ సందర్భంగా ఎస్పీ అభినందిచారు.

31లోపు ఏజెంట్లు దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్: ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు ఈ నెల 31లోపు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ ఏజెంట్లకు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి బిట్ కళాశాలలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ప్రతి అభ్యర్థి 16 మంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటలల్లోపు ఏజెంట్ల వివరాలను ఫారం– 18లో నింపి దరఖాస్తు అందజేయాలన్నారు. ఏజెంట్లు తప్పని సరిగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు క్రమశిక్షణతో మెలగాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి, ఎన్నికల డీటీ రెడ్డి శేఖర్, ఇతర అధికారులు, వివిధ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నమో నారసింహ

- అంగరంగ వైభవం.. లక్ష్మీనృసింహుడి బ్రహ్మ రథోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన పెన్నహోబిలం


పెన్నహోబిలంలో అశేష భక్తజనం నడుమ సాగుతున్న లక్ష్మీనృసింహుడి బ్రహ్మ రథోత్సవం

ఉరవకొండ: నమో నారసింహ నామస్మరణతో పెన్నహోబిలం పుణ్యక్షేత్రం మార్మోగిపోయింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన శ్రీవారి బ్రహ్మరథోత్సవం అశేష భక్త జనం మధ్య మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామికి సుప్రభాత సేవ, అర్చన, అలంకరణ, ఉత్సవ నిత్యహోమాలు నిర్వహించారు.శ్రీదేవి, భూదేవి సమేత నృసింహుడి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి మేళతాళల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై అధిష్టింపచేశారు. ఉదయం 10 గంటలకు విశేషంగా అలంకరించిన స్వామి మడుగుతేరును ఆలయ ఈఓ విజయ్ కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథ్‌చార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం ధూళోత్సవం అనంతరం బ్రహ్మరథోత్సవం ప్రారంభించారు. అశేష భక్త జనం తరలిరాగా రథోత్సవం కనులపండువగా సాగింది. 'నమో నారసింహ', 'గోవిందా గోవింద' అంటూ భక్తులు చేసిన నామస్మరణతో పెన్నహోబిల క్షేత్రం మార్మోగింది. రథంపైకి భక్తులు అరటిపండ్లు, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు అశోక్, తేజోనాథ్, మూలగిరిపల్లి ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

1న మెగా జాబ్ మేళా

హిందూపురం: పట్టణంలోని శ్రీనివాస బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న బాలయేసు డిగ్రీ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన వారికి టాటా ఎలక్ట్రానిక్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జాబ్‌మేళా ఉంటుంది. పదోవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు అర్హులు. జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి ప్రాంత యువతీయువకులకు ప్రత్యేక అవకాశాలు ఉంటాయి. పూర్తి వివరాలకు 95131 33003లో సంప్రదించవచ్చు.

ద్విచక్ర వాహనాల టైర్లు, బ్యాటరీల చోరీ

హిందూపురం అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో సోమవారం రాత్రి ఇళ్ల ఎదుట నిలిపిన రెండు ద్విచక్ర వాహనాల టైర్లు, బ్యాటరీలను దుండగులు అపహరించుకెళ్లారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మాలిక్‌బాషాకు చెందిన ద్విచక్ర వాహనం ముందు టైరు, రామచంద్రారెడ్డికి చెందిన వాహనం బ్యాటరీ తీసుకెళ్లారు. కొన్ని ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీ చేశారు. గతంలో ఇదే కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టిన సంఘటనలున్నాయి. దీంతో రాత్రి సమయంలో గస్తీ చేపట్టాలని పోలీసులకు స్థానికులు విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో మహిళల ఆరోగ్యం


వ్యక్తిగత పరిశుభ్రతపై సూచనలిస్తున్న డాక్టర్ నివేదిత

పుట్టపర్తి రూరల్: పోషకాహారం, శారీరక వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే మహిళలు ఆరోగ్యంగా ఉండవచ్చని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. మంగళవారం ఎనుములపల్లిలోని పీహెచ్‌సీలో రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత, డాక్టర్ జోత్స్న వైద్య సిబ్బందితో కలిసి పోస్టర్లు, కరపత్రాల ద్వారా మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేదిత మాట్లాడుతూ, స్త్రీలు రుతుచక్రం మీద ఉన్న అపోహలు తొలగించుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో శానిటరీ నాప్కిన్లు ఉండేలా చూడాలన్నారు. రక్తహీనత నివారణ కోసం ఐరన్ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. బాల్యవివాహాలు నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నగేష్, డాక్టర్ ముని చంద్రిక, ఆరోగ్య కార్యకర్తలు పరిమళ, సుహాసిని, ఆశా కార్యకర్తలు ముత్యాలమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.